క్లుప్తంగా

కుంకుడు ఆకుపై కొంగ చిత్రం



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కుంకుడు ఆకుపై కొంగ బొమ్మను చిత్రీకరించారు. ఈయన రావి, కుంకుడు ఆకులపై వివిధ రకాల బొమ్మలు వేస్తుంటారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: మండలంలోని మనుబోలు దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకాలంకరణ చేశారు. మహిళలు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలకు గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత



బుచ్చిరెడ్డిపాళెం: చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. జొన్నవాడలోని పెన్నాలో గుంతలు తీసి వీటిని పూడ్చిపెట్టారు. ఎస్సై సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న మరో బస్సు

• ప్రయాణికులకు స్వల్ప గాయాలు

పొదలకూరు: మండలంలోని నెల్లూరు మార్గం మరుపూరుకు సమీపంలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సును మరో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరుకు వెళ్తున్న రాపూరు డిపో బస్సును మరో బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రాపూరు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పొదలకూరు సీహెచ్‌సీలో ప్రయాణికులకు వైద్య చికిత్స చేయించారు.

భూముల రీ సర్వేపై సమీక్ష

కోవూరు: కోవూరుకు సంబంధించిన భూముల రీ సర్వేపై గ్రామస్థాయి సర్వేయర్ల బృందంతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలానందబాబా మాట్లాడారు. కోవూరు పంచాయతీ పరిధిలోని రైతులు తమ సహకారాన్ని సర్వే బృందానికి అందజేయాలని కోరారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదనరావు, డిప్యూటీ తహసీల్దార్ నాజర్, మండల సర్వేయర్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 55.864 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 55.864 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కుక్కలు 'భౌ'బోయ్..



రోడ్డుపై తిరుగుతున్న శునకాలు

• గ్రామాల్లో గుంపులుగా తిరుగుతున్న శునకాలు
• భయపడుతున్న జనం
• ద్విచక్రవాహనదారులను వెంటాడుతున్న వైనం
• సీహెచ్‌సీకి పెరుగుతున్న బాధితులు
• వీధుల్లోకి రావాలంటేనే హడలిపోతున్న పరిస్థితి

కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లో గుంపులుగా ఉంటున్న శునకాలను చూసి జనం భయపడుతున్నారు. కొన్ని ఏరియాల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పొదలకూరు: గ్రామాలు, పట్టణంలో గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా చేరి ప్రజలను భయపడుతున్నాయి. ఏమరుపాటుగా ఉంటే పిల్లలపై దాడి చేస్తున్నట్టు తల్లిదండ్రులు వాపోతున్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణంలో ఓ బాలుడు సైకిల్‌పై వెళ్తుండగా కుక్క తరుముకుని కాలుపై కాటు వేసింది. బాధిత తల్లిదండ్రులు అతడిని సీహెచ్‌సీకు తీసుకెళ్లి యాంటీ రేబిస్ వేయిస్తున్నారు. పొదలకూరు పట్టణంలో ఏ వీధిలో పరిశీలించినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో ఉంటున్నాయి. గ్రామాల్లో అయితే కుక్కల వల్ల ముఖ్యంగా పిల్లలు భీతిల్లుతున్నారు. కుక్కకాటు బాధితులు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు అధిక సంఖ్యలో వస్తున్నట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు.

పెద్ద సంఖ్యలో..

మండలంలో ప్రతి గ్రామంలో రోడ్లపై పెద్ద సంఖ్యలో శునకాలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీ పాలకులు అనుమతి తీసుకుని వాటిని పట్టించి ఊరికి దూరంగా వదిలిపెట్టాల్సి ఉంటుంది. అయితే అనుమతుల విషయంలో జాప్యం జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీనికితోడు పాలకులు సైతం పట్టించుకోకపోవడంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. వీటి సంతానోత్పత్తి తగ్గించేందుకు పశుసంవర్ధక శాఖ వైద్యులు చేసే సూచన ప్రకారం పాలకులు చర్యలు తీసుకున్నా సరిపోతుంది.

సీహెచ్‌సీకి పరుగులు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతినిత్యం కుక్కకాటు బాధితులు వస్తున్నారు. ఇటీవల ఒక్కరోజే పదిమంది వచ్చి యాంటీ రేబిస్ ఇంజెక్షన్ వేయించుకెళ్లారు. అధిక సంఖ్యలో పిల్లలనే శునకాలు కాటు వేస్తున్నాయి. అంకుపల్లిలో ఓ యువకుడిని కాటు వేయడంతో సీహెచ్‌సీకు వచ్చి ఇంజెక్షన్ వేయించున్నాడు. వీటిలో పిచ్చికుక్కలు ఉంటే ప్రమాదకరమంటున్నారు. పెంపుడు కుక్కలను సైతం వీధుల్లోకి వదిలేస్తుండటంతో అవి స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా చేరుతున్న కుక్కలు పిల్లలపై పడుతున్నాయి.



సీహెచ్‌సీ వద్ద జనం ఇలా..

కుక్కల సంఖ్య తగ్గించాలి



కుక్కల సంఖ్యను పంచాయతీ పాలకులు తగ్గించాలి. పండగ సందర్భంగా ఇంటికి వచ్చా. రోడ్డుపై వెళ్తుంటే కుక్క కాటు వేసింది. దీంతో సీహెచ్‌సీకు వచ్చి వైద్యులు వెల్లడించిన విధంగా ఏఆర్‌వీ ఇంజెక్షన్ వేయించుకున్నా. పట్టణంలోనే కాక గ్రామాల్లో కూడా విపరీతంగా శునకాలున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– టి.ప్రసాద్, బాధితుడు, అంకుపల్లి

ఏఆర్‌వీ అందుబాటులో ఉంది



కుక్కకాటు బాధితులు వస్తున్నారు. సీహెచ్‌సీలో ఏఆర్‌వీ అందుబాటులో ఉంది. కుక్కకాటు వేసిన వెంటనే నీటితో శుభ్రం చేస్తే చాలావరకు ప్రమాదం తగ్గుతుంది. తర్వాత ఆస్పత్రికి వచ్చి నిర్దేశించిన తేదీల్లో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాల్సి ఉంటుంది. పిల్లలను పెద్దలు రాత్రివేళల్లో జాగ్రత్తగా ఇంటికి తీసుకువెళ్లాలి.

– డాక్టర్ ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పొదలకూరు

ముత్తుకూరు మండల మీట్ నేడు

ముత్తుకూరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీఓ నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడూ, రేపు విద్యుత్‌కు అంతరాయం

ఇందుకూరుపేట: మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శని, ఆదివారాల్లో అంతరాయం ఏర్పడనుందని ఏడీ సురేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

⇨ **తోటపల్లిగూడూరు:** కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శని, ఆదివారాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవలాకులతోటలోని ప్రధాన విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో పోట్లపూడి, సౌత్‌ఆములూరు, నరుకూరు విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శని, ఆదివారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడులు

మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామ సమీపంలో కోడి పందేల స్థావరాలపై గురువారం రాత్రి ఎస్సై శివ రాకేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.7,320 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తులిచ్చిన సమాచారంతో దాడులు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతలతో భేటీ



కొడవలూరు: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం, కొత్తవంగల్లు, గౌతమ్‌నగర్, యల్లాయపాళెం, తలమంచి గ్రామాల్లోని పార్టీ నేతలను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. హామీలను నెరవేర్చకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ బచ్చు సుప్రియ, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, నేతలు కరిముల్లా, చక్కా మనోహర్, వేముల వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి రమేష్, ఆత్మకూరు సతీష్, రాయపు వేణు, వెంకటేశ్వర్లును ఆయన కలిశారు. నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, గాలి సునీల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిశోధన గ్రంథం సమర్పణ



విద్యార్థులకు అభినందన

కొడవలూరు: ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ టెక్నాలజీ సంస్థకు పరిశోధన గ్రంథాన్ని నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఎంబీఏ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థులు సమర్పించారు. వీటిని సమర్పించిన విద్యార్థులు విశ్వాస్, ఫణి, రుహినా, సోఫియాను కళాశాల చైర్మన్ గుణశేఖర్ శుక్రవారం అభినందించారు. ఆర్ అండ్ డీ డీన్ వెంకటనాగేంద్ర, ఎంబీఏ విభాగాధిపతి విజయకుమార్, ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాపం జ్వరపీడితులు



ఇంటింటి సర్వేలో భాగంగా వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో జర్వపీడితుల పరిస్థితులు దారుణంగా మారింది. ఇప్పుడిప్పుడే జ్వరాలు అదుపులోకి వస్తున్న నేపథ్యంలో బాధితులు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. వృద్ధులైతే కూర్చుని లేవలేక పోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెలరోజులుగా తాటిపర్తిని జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ఈ క్రమంలో మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యులు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తించి వైద్యం అందిస్తున్నారు. దోమలు, అపరిశుభ్రమైన నీటి కారణంగా ప్రజలకు వైరల్ ఫీవర్స్‌తోపాటు మలేరియా, టైఫాయిడ్ వస్తోంది. అయితే ఇవి తగ్గినా బాధితులు తీవ్రమైన ఒళ్లు నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. కొందరైతే నొప్పులకు తట్టుకోలేక నెల్లూరు నగరం, పొదలకూరులోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.వేలు ఖర్చు చేసుకుంటున్నారు. ఇంటిల్లిపాదికి జ్వరాలు వచ్చి రూ.50 వేలు కూడా ఖర్చు పెట్టినట్టు కొందరు వెల్లడించారు. దిగువ మధ్య తరగతి కుటుంబాల వారు అప్పు చేసి మరీ వైద్యం చేయించుకుంటున్నట్టు తెలిపారు. తాటిపర్తి పెద్ద గ్రామం. ఇక్కడ నాలుగు వేల పైచిలుకు జనాభా ఉంటారు. ఇళ్ల మధ్యలో పేడదిబ్బలు, మురుగుకాలువలు ఉండటంతో వల్ల దోమల ఉధృతి అధికంగా ఉంది. దీంతో నెలరోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి.



తాటిపర్తిలో మురుగునీటిపై ద్రావణం పిచికారీ (ఫైల్)

జ్వరాలు అదుపులో ఉన్నాయి



తాటిపర్తిలో జ్వరాలు అదుపులో ఉన్నాయి. అయితే వైరల్ ఫీవర్ తగ్గినప్పటికీ మూడు వారాలపాటు కీళ్ల నొప్పులుంటాయి. జ్వరపీడితులు నొప్పుల మాత్రలు వాడొద్దని చెబుతున్నాం. నాలుగు నుంచి ఐదురోజులు మాత్రమే పెయిన్ కిల్లర్స్ వాడాలి. తర్వాత నొప్పులుంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా స్వాంతన పొందాలి. ఇదే విషయాన్ని ప్రైవేట్ క్లినిక్ డాక్టర్స్‌కు కూడా చెప్పాం.

– డాక్టర్ నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి, మహ్మదాపురం

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

ఇందుకూరుపేట: యాజమాన్య పద్ధతులను రైతులు తప్పక పాటించాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని కొమరికలో శుక్రవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలుపు నివారణ చర్యలు, ఎరువుల వినియోగంపై వివరించారు. అనంతరం ఏడీ రాజ్‌కుమార్ మాట్లాడారు. ఎలుకల నివారణకు వ్యవసాయశాఖ బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ రఘునాథ్‌రెడ్డి, వీఏఏలు శ్రీకాంత్, సుదీప్త తదితరులు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు:** మండలంలోని ఆలూరుపాడు, రామన్నపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహిక ఎలుకల నివారణపై ఆలూరుపాడులో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేశారు. ఏఓ లక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు పృథ్వి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

⇨ **వెంకటాచలం:** ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. సాగులో పెట్టుబడులు తగ్గించుకుని, లాభాలు ఎలా పొందాలో వివరించారు. మోతాదుకు మించి నత్రజని వినియోగించవద్దని సూచించారు. ప్రస్తుతం వరి పంటకు సోకే తెగుళ్ల గురించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు.

⇨ **తోటపల్లిగూడూరు:** మండలంలోని చింతోపు గ్రామంలో పంట పొలాలను శుక్రవారం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో వీలైనంత వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, కేవీకే శాస్త్రవేత్తలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: ఆలూరుపాడులో పొలం పిలుస్తోంది



వెంకటాచలం: కురిచెర్లపాడులో రైతులకు అవగాహన



తోటపల్లిగూడూరు: చింతోపులో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు 10 (ఏ) నేవల్ యూనిట్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి గణేష్ బాలాజీ కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో ఈఓ శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

దోమల నివారణ చర్యలు



కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలో దోమల నివారణ చర్యలను కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి లార్వా ఉత్పత్తి ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎస్ రామ్మోహన్ మాట్లాడారు. డ్రైడేను ప్రతి శుక్రవారం పాటించాలని కోరారు. హెచ్‌ఏ వెంకట్రావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న రంగనాథ్‌గౌడ్

కోవూరు: మండలంలోని ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ఎస్సై రంగనాథ్‌గౌడ్ పేర్కొన్నారు. రహదారి మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ధ్రువీకరణ పత్రాలను విధిగా ఉంచుకోవాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సమగ్రంగా ఇంటింటి సర్వే



కొడవలూరు: కుష్టుపై ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత ఆదేశించారు. కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేపై మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సర్వేను సమగ్రంగా నిర్వహించినప్పుడే కుష్టును ప్రాథమిక దశలో గుర్తించొచ్చని చెప్పారు. వ్యాధిని నిర్ధారించాక చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. డీపీఎంఓ నరసారెడ్డి, వైద్యాధికారులు కావ్య, కామాక్షయ్య, హెచ్‌ఎస్‌లు సురేంద్ర, రజియా, హెచ్‌ఏ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

రాపూరు: అటవీ ఫలాలతో గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ పీఓ పరిమళ అన్నారు. రాపూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం వన్‌ధన్ వికాస్ కేంద్రాల్లోని గిరిజన మహిళలకు ఉసిరి ఊరగాయ, షర్బత్, కుంకుడు కాయ పౌడర్, షాంపు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 15 గిరిజన గ్రూపులు ఉన్నాయన్నారు. సభ్యులు అడవుల్లో సేకరించిన మారేడు గడ్డ, కుంకుడు, వట్టివేర్లు, తదితరాలను తీసుకొచ్చి వారే సొంతంగా షాంపులు, షర్బత్ తదితరాలు తయారు చేసుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విక్రయాల ద్వారా వచ్చే నగదును గ్రూపు సభ్యులకు పంచి వారిని ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ, వెలుగు సిబ్బంది, గిరిజన మహిళలు పాల్గొన్నారు.